క్లుప్తంగా

రీసర్వే అభ్యంతరాలపై గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ లాజరస్

ఓజిలి: మండలంలోని వెంకటరెడ్డిపాళెం పంచాయతీ బత్తలాపురం లో తహసీల్దార్ లాజరస్ గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రామంలో రీసర్వే పూర్తిఅయిందన్నారు. రీసర్వేలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఆర్ఓఆర్ ద్వారా భూములు వివరాలు తెలుసుకుని సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీఆర్వో ప్రసన్నకుమార్, సర్వేయర్ నాగూర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నేత కాకాణి రవి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

దక్కిలి: మండలంలోని పెదయాచసముద్రం (పీవై సముద్రం) ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును గురువారం ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. భోజన పదార్థాల రుచి చూశారు. ఎంఈఓ మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం మెనూ అమలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కడైనా పాఠశాలలో మెనూ సక్రమంగా లేకుంటే ప్రధానోపాధ్యా యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

గూడూరు: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసియున్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష హోమానంతరం, స్వామి,అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీ పొన్నలూరు కోటారెడ్డి నృత్య పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు రంజింపజేశాయి.

మందుల వితరణ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నాయుడుపేటకు చెందిన దాత సురేష్ రూ.లక్ష విలువైన మందులను పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



గూడూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ మోహన్ రావు పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని దివిపాళెం తూర్పు లేఔట్‌లో తయారు చేస్తున్న సిమెంట్ ఇటుకల నాణ్యతా ప్రమాణాలను గురువారం డీఈ చలమయ్య, ఏఈ షబ్బీర్‌తో కలసి పరిశీలించారు. ఏ మేరకు సిమెంట్ వాడాలనే విషయాలను వివరించారు. అనంతరం కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో ప్రభుత్వం అన్ని మౌలిక వసతులను కల్పించిందని తెలిపారు. లబ్ధిదారులను కలిసి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయించాలని తెలిపారు.

కేసులు నమోదు చేస్తేగానీ మారరా..?

500 కిలోల పాలిథిన్ కవర్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌తో కమిషనర్, సిబ్బంది

గూడూరు: ఎన్ని సార్లు దాడులు చేస్తాం..ఫైన్‌లు వేస్తాం..అయినా మీలో మార్పు రాదా..క్రిమినల్ కేసులు నమోదు చేస్తే గానీ మీరు..మారరా.. అంటూ దుకాణదారులపై మున్సిపల్ కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని లక్ష్మీ శ్రీనివాసా ట్రేడర్స్‌పై దాడి చేసి 500 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించిందని తెలిపారు. ఎన్నిమార్లు హెచ్చరిస్తున్నా విక్రయాలు సాగుతూనే ఉన్నాయన్నారు. లక్ష్మీ శ్రీనివాసా ట్రేడర్స్‌పై రెండవ పర్యాయం దాడి చేయగా, 500 కిలోలు పాలిథిన్ కవర్లు దొరికాయని తెలిపారు. ఈసా రి పట్టుబడితే కేసు నమోదు చేస్తామని హెచ్చ రించారు.

చెత్తతో సంపద తయారీ

పెళ్లకూరు: నివాసాల నుంచి సేకరించే చెత్త, చెదారాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయడం ద్వారా సంపద సృష్టించుకోవచ్చని డీఎల్‌పీవో వెంకటరమణ అన్నారు. గురువారం భీమవరం గ్రామంలో చెత్తతో సంపద తయారీ కేంద్రంలో వానపాములను వదిలారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, సర్పంచ్ కమలమ్మ, మాజీ సర్పంచ్ బియ్యపు గోవిందురెడ్డి పాల్గొన్నారు.

గృహ సారథులే రథ సారథులు

- సైనికుల్లా పనిచేసి పార్టీ పటిష్టతను పెంచాలి
- పథకాల లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు



గృహ సారథులు, కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చిట్టమూరు : 'వైఎస్సార్ సీపీకి గృహ సారథులే రథ సారథులు.. ఇప్పటి నుంచే పార్టీ పటిష్టతకు సైనికుల్లా పనిచేయాలి.. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధిక మెజారిటీతో గెలిపించే బాధ్యతను క్రమశిక్షణతో చేపట్టాలి' అని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం చిట్టమూరు మండలంలో నూతనంగా నియమించిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఆర్థిక భరోసా ఇచ్చేలా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి ఇంటి ముంగిటకే అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్ వ్యవస్థతో ప్రతి పథకం నేరుగా లబ్ధిదారులకు పారదర్శకంగా అందుతోందని పేర్కొన్నారు. మరి కొంత ముందుకు అడుగు వేస్తూ నూతనంగా గృహ సారథులను నియమించి వలంటీర్లకు సమన్వయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత గృహ సారథులు, కన్వీనర్లపైనే ఉందన్నారు. సచివాలయ పరిధిలో తమకు కేటాయించిన గృహాలను తరచూ సందర్శిస్తూ ప్రజల సందేహాలను తీర్చాలని తెలిపారు. ఎవరైనా అసంతృప్తిగా ఉంటే కారణాలు తెలుసుకుని నివృత్తి చేయాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సిఫార్సు చేసిన వారికి మాత్రమే సంక్షేమం అందేదన్నారు. ప్రస్తుతం కులమతపార్టీలకతీతంగా సీఎం జగన్‌మోన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని, మరోసారి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చే సమయంలోనే పేదలు గుర్తుకు వస్తారని అందుకే లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని, ఇందుకు పార్టీ శ్రేణుల నుంచే మద్దతు లేక పోవడంతో ఆలోచనలో పడ్డారని ఆరోపించారు. లోకేష్ పాదయాత్ర నవ్వుల యాత్రగా మారిందని ఎద్దేవా చేశారు. నేతలు దువ్వూరు శేషురెడ్డి, జెడ్పీటీసీ చెప్పల వెంకటయ్య, మేరి, మధుయాదవ్, సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- పార్టీ పటిష్టతకు సైనికుల్లా పనిచేయాలి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- గృహ సారథులకు దిశా నిర్దేశం

నాయుడుపేట: అర్హతే ప్రామాణికంగా ప్రజల ముంగిటకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. గురువారం నాయుడుపేట జెడ్పీ క్రీడా మైదానంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో సమూలమైన మార్పులు తీసుకుని వచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు సులభతరమైన పాలన కోసం వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకు వచ్చారన్నారు. వలంటీర్లతో గ్రామాల్లో ప్రతి ఇంటి సమస్యను పరిష్కరిస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే పాలన తీసుకుని వచ్చినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఖాతా ల్లోకే నేరుగా పథకాల నగదు జమ అవుతుండడంతో అవినీతికి ఎక్కడా చోటు లేదన్నారు. గృహసారథులు గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసి ప్రభుత్వ పథకాల లబ్ధి, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. అలాగే వారి అభిప్రాయాలను సేకరించాలని తెలియజేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మాయమాటలతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. జన్మభూమి కమిటీలతో టీడీపీ నాయ కులు ప్రభుత్వ పథకాలను పందికొక్కుల్లా తిన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు వేణుంబాక లక్ష్మీ నారాయణరెడ్డి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కట్టా భవానీశంకర్‌రెడ్డి, జలదంకి వెంకటకృష్ణారెడ్డి, నెలవల మమత, చదలవాడకుమార్, ఓట్టూరు కిషోర్‌యాదవ్, నారాయణరెడ్డి, దారరవి, నాగార్జున, కరుణాకర్‌రెడ్డి, నెలవల రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా వెంకటగిరి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- వెంకటగిరికి చేరువలో ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ సంస్థలు
- అభివృద్ధి ప్రణాళికకు త్వరలో సమావేశం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మెరుగైన మౌలిక వసతులతో వెంకటగిరిని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయనను నివాసంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సేతురాశి బాలయ్య, పలువురు కౌన్సిలర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి–ఏర్పేడు మార్గంలో ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలతో పాటు పలు పరిశ్రమలు ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఆ సంస్థలతోపాటు, అనుబంధ సంస్థల సిబ్బందికి వెంకటగిరి అనువైన పట్టణంగా గుర్తింపు వచ్చేలా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఇందు కోసం త్వరలో కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు తీసుకుని, పట్టణ రూపురేఖలు మార్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. దీన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా రేణిగుంట వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. అంతకుముందు కూరగాయల మార్కెట్ వ్యాపారులు నేదురుమల్లిని కలిసి నూతన మార్కెట్ నిర్మా ణానికి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. సీనియర్ నేతలు చెలికం శంకరరెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, చిట్టేటి హరికృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ జలగం కామాక్షి, కౌన్సిలర్లు వహీదా, కె.కృష్ణమూర్తి, కోటంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మైనారిటీ విభాగం తిరుపతి జిల్లా కార్యదర్శి యస్దానీబాషా, టి గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు రాయితీ

సైదాపురం: ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలను అందిస్తున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండలంలోని రామసాగరంలో ఉపాధి పథకం కింద సాగు చేసిన ఉద్యాన తోటలను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఉపాధి పనులను కూడా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిమ్మ సాగు చేసే రైతులకు తోటలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీపై రుణాలను ఇస్తుందని తెలిపారు. ఏపీఓ మురళి పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

వాకాడు: మండలంలో మూడు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ తోట గోపీనాథ్ తెలిపారు. ఆయన గురువారం కార్యాలయంలో మాట్లాడుతూ పూడిరాయిదొరువు పంచాయతీలో ఒకటి, బాలిరెడ్డిపాళెం పంచాయతీలో ఒకటి, వాలమేడు పంచాయితీలో ఒక గ్రామ వలంటీర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గిన వారు ఈ నెల 13 లోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు తమ కార్యాలయ పనివేళల్లో సిబ్బందిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈనెల 15న ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

1న ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

కలువాయి: కలువాయి మండలం వెరుబొట్లపల్లెలో మార్చి 1వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్ర ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ సోమ్లా నాయక్, వ్యవసాయాధికారి ప్రతాప్ తెలిపారు. వెరుబొట్లపల్లెలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించి కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. వీఆర్వో జయరామయ్య, వ్యవసాయ సహాయకులు చెంచయ్య, రైతులు పాల్గొన్నారు.

కండలేరులో 47.846 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 47.846 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ హెడ్‌రేగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,210 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 30, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీస్‌కు 70, హైలెవల్ స్లూయీస్‌కు 180 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు వివరించారు.

తహసీల్దార్‌గా సుభాషిణి



రాపూరు: రాపూరు తహసీల్దార్‌గా సుభాషిణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ శ్యాంసుందర్‌రాజ సీతారామపురానికి బదిలీ అయ్యారు. వెంకటాచలం డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న సుభాషిణికి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు.

మంచి జరిగిందనిపిస్తే మళ్లీ ఆశీర్వదించండి

- సంక్షేమ పథకాల జాబితా రెట్టింపు అవుతుంది
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మీకందరికీ మంచి జరిగిందనిపిస్తే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్ననే ఆశీర్వదించాలని, మరోమారు అవకాశం ఇస్తే ఇదే సంక్షేమాన్ని మరింత రెట్టింపు చేసి నిరుపేదల ప్రజల పక్షాన నిలబడి చూపిస్తామని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ 23, 24, 25 వార్డుల పరిధిలోని పందలగుంట గిరిజన కాలనీ, పరసారత్నం కాలనీ, కోళ్లమిట్ట ప్రాంతాల్లో గురు వారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయనకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి పథకాలతో ఎంత లబ్ధి అందిందో అంకెలతో సహా వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సుమారు రూ. లక్ష నుంచి సుమారు రూ. 10 లక్షలు వరకు లబ్ధి పొందిన కుటుంబాలున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు అందుకున్న వారు మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని సంతోషంగా చెబుతున్నారని పేర్కొన్నారు. సూళ్లూరుపేటలో శాశ్వతంగా దాహార్తిని తీర్చేందుకు రూ.1.42 కోట్లతో పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. పందలగుంట, పరసారత్నం కాలనీలకు వెళ్లే రోడ్లు దారుణంగా ఉంటే గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సిమెంట్‌రోడ్లు వేశామని చెప్పారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమానంగా చేస్తుంటే టీడీపీ నాయకులు జగనన్నపై అవాకులు చవాకులు పేలుతున్నారని అన్నారు. లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని, ఆయన ఒళ్లు తగ్గించుకోవడానికి చేస్తున్న వ్యాయామ యాత్రలా ఉందని ఆరోపించారు. జగనన్న చేసిన పాదయాత్రను పోలుస్తూ చేస్తున్న లోకేష్ పాదయాత్ర పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టుగా ఉందని చెప్పారు. వైస్ చైర్మన్ పోలూరు పద్మామిల్టన్, కమిషనర్ నరేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాన్నా మునిప్రసాద్, పముజుల విజయలక్ష్మి, ఊటి మునీంద్ర, వాయలూరు రజనీ, మీజూరు రామకృష్ణారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కాళహస్తి బాబూరావు, కళత్తూరు సునీల్‌రెడ్డి, ఫయాజ్, నాయకులు జెట్టి వేణుయాదవ్, వాయిలూరు రాజా, గోగుల తిరుపాల్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థి మృతిపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న నిఖిల్‌సాయి

గూడూరు: నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ధరణేశ్వర్‌రెడ్డి మృతిపై సమగ్ర విచారణ జరిపి, అతని తల్లిదండ్రులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్, ఏబీవీపీ, భగత్ సింగ్ విద్యార్థి యూనియన్ నాయకులు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడు నిఖిల్‌సాయి మాట్లాడుతూ ధరణేశ్వర్‌రెడ్డి కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడని కళాశాల యాజమాన్యం ఆరోపించడం దారుణమన్నారు. ఇంట్లో ఎలాంటి గొడవలు, కలహాలు లేవని తమ నిజనిర్ధారణలో ఆ గ్రామస్తులు తెలిపారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నారాయణ కళాశాలల్లో చదివే విద్యార్థులు ఎందరో ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థుల మరణానికి కారణమవుతున్న నారాయణ విద్యాసంస్థలను మూసేయాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు ధరణేశ్వర్‌రెడ్డి మృతిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. లేదంటే విద్యార్థి సంఘలంతా ఐక్యంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కార్తీక్, నాయకులు వెంకటేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులు, వంతెనలు నిర్మిస్తాం



రాజుపాళెంలో శిరీషకు సమస్యను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సైదాపురం: మండలంలోని పొలూరు రాజుపాళెం, లింగసముద్రం, సైదాపురం గ్రామాల్లో అవసరమైన చోట్ల కల్వర్టులు, వంతెనలు, చప్టాలను ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్నట్లు ప్రోగ్రాం అధికారి దావూలూరి శిరీష తెలిపారు. రాజుపాళెం, సమీపంలో ఉన్న కైవల్యానది వద్ద వంతెన లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పొలూరు ఎంపీటీసీ సభ్యులు ఈశ్వరరాజు, వైఎస్సార్ సీపీ నేత చెమిర్తి శ్రీనివాసులురాజు గురువారం ఆమె దృష్టికి తీసు కెళ్లారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రమైన సిద్ధలయ్య కోన వద్ద కూడా కల్వర్టులను నిర్మించాలని ఉపసర్పంచ్ బొలిగర్ల శివకుమార్ వైఎస్సార్‌సీపీ నేతలు ఇవుల సాంబయ్య, మల్లారపు పెంచలయ్య కోరారు. దీనిపై శిరీష స్పందించారు. ఆమె మాట్లాడుతూ తమ ట్రస్టు తరపున అవసరమైన చోట్ల కల్వర్టులు, వంతెనలు, చప్టాలను నిర్మిస్తామని వెల్లడించారు. ఫౌండేషన్ అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది మస్తానమ్మ,గోపాల్, మస్తానయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోనే ముస్లింల అభ్యున్నతి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ

నాయుడుపేట: ముస్లింల అభ్యున్నతికి పెద్ద పీట వేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల పక్షపాతి అని మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ముస్లింలకు ద్రోహం చేసిందన్నారు. ముస్లిం పేద కుటుంబాలను పట్టించుకోలేదన్నారు. ముస్లింలు టీడీపీ అండగా ఉన్నారని చంద్రబాబు ప్రకటించడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ముస్లింలు టీడీపీ అండగాలేరని స్పష్టం చేశారు. నాడు వైఎస్సార్, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా ముస్లింల అభ్యున్నతికి పలు పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ముస్లింలు వైఎస్సార్ కాంగ్రెస్ వెంట నడుస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మాటలను ముస్లింలు ఏవగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి నాయుడుపేటలో అయ్యప్పస్వామి జ్యోతి పూజోత్సవానికి స్థలం కావాలని వినతిపత్రం అందించామన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి స్థలం మంజూరు చేస్తామని తెలిపారని పేర్కొన్నా రు. వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షరీఫ్, ముస్లిం మత పెద్దలు షేక్ రఫీ, కోఆప్షన్ సభ్యులు ఖాజాగరీబ్, రహంతుల్లా, మైలానా యూషబ్, షఫీ, నిజాం, సుబాన్, ఇబ్రహీం, ఇమాన్, జాకర్, షబ్బీర్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం



రాపూరు : సూచనలిస్తున్న జిల్లా పోగ్రాం అధికారి దయాకర్

గూడూరు: మాతా, శిశు మరణాలను తగ్గించేలా సురక్షిత ప్రసవలే లక్ష్యంగా గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారావు తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం ప్రధానమంత్రి మాతృత్వ యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలపై అవగాహన కల్పించారు.

రాపూరు: మండలంలోని వేపినాపి పీహెచ్‌సీలో గురువారం 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐరన్ తక్కువగా ఉన్నవారికి వైద్యాధికారి సూర్యధర్మేంద్ర మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న పరీక్షలను నెల్లూరు జిల్లా పోగ్రాం అధికారి దయాకర్ పరిశీలించారు. సంక్రాంతిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను కూడా తనిఖీ చేసి సీహెచ్ఓ మమతకు పలు సూచనలు ఇచ్చారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

దక్కిలి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యవంతంగా పుడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి హరిత తెలిపారు. పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

చిల్లకూరు : గర్భిణులు సురక్షిత ప్రసవం కావాలంటే జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి భావ నారాయణ తెలిపారు. పీహెచ్‌సీలో గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేసుకుంటే ఖర్చు తగ్గించుకోవడంతో పాటుగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు.

కృష్ణారెడ్డికి నేదురుమల్లి నివాళి

వెంకటగిరి: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పులి కృష్ణా రెడ్డి ఉత్తరక్రియలు గురువారం వెంకటగిరిలో జరిగాయి. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో నేతలు చెలికం శంకరరెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, జి ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

గూడూరు: రైలు ప్లాట్‌ఫాం వద్దకు వస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి దాని కిందపడి తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన గూడూరు రైల్వే జంక్షన్‌లో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ కొండపనాయుడు వివరాలు.. గురువారం తెల్లవారు జామున తిరుపతి వెళ్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ గూడూరు జంక్షన్ సమీపిస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తి పట్టాలపై పడిపోయాడు. దీంతో అతని కాలు, మెడకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో అతన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, మృతుడికి 45 ఏళ్ల వయసు ఉండవచ్చని, హిందీలో మాట్లాడాడని తెలిపారు. బ్లూ కలర్ గళ్ల లుంగీ, సిమెంట్ కలర్ రంగు చొక్కా ధరించి ఉన్నాడని ఎస్ఐ వెల్లడించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.